

# బ్రతుక నేర్చిన వాడు

మధురాంతకం రాజారాం

ఇంచుమించు ఏడెనిమిది నెలలుగా అన్వేషిస్తున్నాను. చంద్రగిరిలో వున్నాడని తెలిస్తే అక్కడికి వెళ్లాను. "అబ్బే. కాళహస్తికి బదిలీ వచ్చిందండీ" అన్నారు అక్కడికి ఒకటి రెండు సార్లు వెళ్ళాను క్యాంపులో వున్నట్టు తెలిసింది మూడో సారి వెళ్ళేసరికి "మదనపల్లికి ట్రాన్స్ఫర్ వేయించుకున్నాడండీ" అన్నారు అక్కడ. యిదంతా ఈ యేడిది వెన్నంటిన వ్యవహారమై పోతోందనిపించి కాస్తా చిరాకు గూడా కలిగింది.

కానీ నేనొక్క విషయంమాత్రం గట్టిగా చెప్పగలను. అసలే నేను ఇన్సూరెన్సు ఉద్యోగిని. జీవితాలను భీమా వేసే ధీమా వున్నవాళ్ళకోసం గ్రామగ్రామాలనూ గాలించడమే నా పని. ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు వాడు నాకు తారసిల్లకపోడు కనిపించగానే ఏకాంతంలోకి తీసుకెళ్ళి గుక్క త్రిప్పుకోడానికి వీల్లేకుండా నాలుగు చెంపదెబ్బలు ఎడా పెడా వాయించేయాలన్నదే నా అభిలాష! కానీ నాకో సందేహంగూడా వుంది. వాడు వాలి! వాలిపైకి యెవడు మోహరించుకుని వెళ్ళినా వాడి బలంలో సగం వాలికి సంక్రమించేదట! చచ్చిన చావు సంగతెలా వున్నా బ్రతికున్నంత కాలం వాలి అజేయుడుగానే బ్రతికాడు. పోగా ఏదో పుస్తకంలో నేనొక విచిత్రోదంతాన్ని గురించి చదివాను అమెరికాలోనట, ఓ మహానుభావుడు వరుసగా పాతిక

మందిని హత్య చేసేశాడట! ఇంత అఘాయిత్యం చేసినా తనకు శిక్ష వేయడంలో అణుమాత్రమైనా న్యాయంలేదని అతగాడు ఆఖరు క్షణందాకా హృదయపూర్వకంగా విశ్వసించాడట! మా వాడిలో ఆ వాలి లక్షణాలే గాక ఈ హంతక చక్రవర్తి లక్షణాలుగూడా వున్నాయి. ఎంత కోపంగా వెళ్ళినా వాడి ముఖాన్నీ, ఆ సుమధుర దరహాసాన్నీ, ఆ హావభావ విన్యాసాల్నీ చూడగానే సగం కోపం చల్లారిపోతుంది. అంతటితో మనం చప్పబడి. వాడు నోరు తెరిచేశాడంటే— యిక ఆత్మసమర్థన కాంక్రీటుతో కట్టిన కట్టడంలా రూపొంది పోతుంది.

కానీ తనకు పుట్టుకతోనే అబ్బిన ఈ జగజాణతనంతో వాడు నన్ను మోసగించలేడు! బహుశా నేను వాడిమీద చేయి చేసుకోలేకపోవచ్చు. ఐతే ఎదుటపడగానే "యిది నీకు బుద్ధిగాదు. నువ్వు చదివిన చదువుకు, చేస్తున్న ఉద్యోగానికీ యిది యోగ్యత కాదు" అని దుయ్యబట్టడం మాత్రం నాచేతనౌను!

వాడి పేరు వీరభద్రం. వయస్సు ముప్పైకి దరిదాపుల్లో వుంటుంది. మనిషి స్ఫురద్రూపి. పైగా పైపై హంగుల్ని సంతరించుకోడంలో అప్రమత్తుడు. పరువుగా బ్రతికిన కుటుంబం వాడిది. అంచేత వాడి మర్యాదలోనూ, మన్ననలోనూ లోపాన్ని వ్రేలెత్తిచూపడం దుస్తరం వాడు మంచి వక్త. మీదుమిక్కిలి నటుడు. హైస్కూల్లో వాడి నటనకు (నాటకాల్లోని నటనకే ననుకోండి) బోలెడన్ని ప్రైజులు వచ్చాయి. స్కూలు ఫైనలు దాటగానే మేమిద్దరమూ విడిపోయాము. వీరభద్రం కాలేజికి వెళ్ళాడు. నాలుగేళ్ళు చదివి చిట్టచివర ఫెయిలై కూచున్నాడు. ఐనా వాడందుకు చింతించలేదు. పరీక్ష పోతుందనీ, పోయినా ఈ నాలుగేళ్ళలో తను లెక్కలేనంత లోకానుభవం గడించగలిగాననీ, ముఖ్యంగా తన నటన రాటుదేలి పదహారువన్నెల బంగారంలా ప్రకాశిస్తోందనీ, వెండి కప్పులు అలమరాకు పట్టడం లేదనీ జాబు వ్రాశాడు. పరీక్ష ఫెయిలైన సంవత్సరమే వాడికి పెళ్ళయింది. పిల్లనిచ్చిన మామగారే రివిన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం చూచిపెట్టారు. మూడేళ్ళు ఉద్యోగం చేశాడో లేదో ప్రమోషనుగూడా వచ్చింది.

ఆ వచ్చిన ప్రమోషను పిలిస్తే పలికే జవానుతో, నలభై రూపాయల ఫిక్సెడ్ టి. ఎ. తో, ఒక ఫిర్కాపైన అధికారంతో వచ్చింది.

సదరు ప్రమోషనువచ్చిన కొత్తలోనే నేను చివరిసారిగా వీరభద్రాన్ని కలుసుకోడంగూడా జరిగింది.

వాకబుచేస్తూ వెళ్ళి యింటిని వెదికి పట్టుకోగలిగాను. అది మూడంకణాల మిద్దె టిల్లు. ఇసుపకమ్ములమరించిన వరాండాలో బోనులో బిక్కరిస్తున్న మేకంలా జవాను కనిపించాడు.



మెల్లెక్కి వరాండాలో కాలుబెట్టాను. విలు విలుమన్నట్టుగా అతడి చూపులు నన్ను అటకాయించాయి.

ఎలా ప్రశ్నించాలో తోచింది గాదు. ప్రయత్నపూర్వకంగా, ఉద్యోగుల లోకంలో వ్యవహృతమౌతూన్న పరిభాషను జ్ఞప్తికి తెచ్చుకుని "అయ్యగారున్నారా" అని ప్రశ్నించాను.

"లేరు" అన్నాడా జవాను. వెలిగిన క్షణాన్నే ఆరిపోయిన టార్చిలైటు వెల్తురులాంటి జవాబు. ఆరిపోగానే మళ్ళీ ముసురుకున్న చీకటిలాంటి మౌనం. విగ్రహం లాంటి మనిషి.

"ఇంట్లోనే లేరా! ఊళ్ళోనే లేరా!" మళ్ళీ నా ప్రశ్న.

"ఇంట్లో లేరు."

"ఊళ్ళో ఉండవచ్చు గదూ!"

"ఉండొచ్చు."

"లేదా క్యాంపుకుగూడా వెళ్ళివుండవచ్చు ననుకుంటాను."

"వెళ్ళి వుండొచ్చు."

"ఎప్పుడొస్తారో మీకు తెలియదు?"

"తెలియదు."

ఓరి వీడి బండ్రోతుతనం కూలిపోనూ! వీడు బిర్రబిగుసుకున్న అలిగర్ బీగంకాయలా వున్నాడు!

"అయ్యా మహాశయా! నేను రివిన్యూ యిన్స్పెక్టర్ని చూడ్డానికి రాలేదు. వీరభద్రాన్ని చూడ్డానికి వచ్చాను. వాడు నా చిన్ననాటి స్నేహితుడు?" అని చెబుదామనుకున్నాను. ఎంత చెప్పినా అతడు అర్థంచేసుకునే ధోరణిలో లేడు!

చెప్పదలచుకున్న విషయాన్ని చేతగా మార్చుకోడమే సబబనిపించింది. తృటిపాటులో అతణ్ణి తప్పించుకుని చరచరా లోపలికి వెళ్ళిపోయాను.

కాళ్లూ చేతులూ విదిలించుకుంటూ గిజ గిజలాడిపోతున్న బిడ్డ నోట్లో మందు పోస్తున్న మాలతి "అబ్బబ్బ! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు! కూచోండన్నయ్యా! బాగు న్నారు కదూ!" అంటూ పలకరించింది.

"అదేమిటమ్మాయ్‌! పాపాయి కి ఒంట్లో కులాసాగా లేదేమిటి?" అన్నాను.

"మొదట జలుబు. దాని వెంటనే జ్వరం. రాత్రంతా మూసిన కన్ను తెరవ లేదు. ఏం చేయమంటా రన్నయ్యా! ఈ అబ్బనాకారపు బిడ్డలతో వేగలేక సత మతమై పోతున్నాను ..."

"నిజమే మరి! ఇంటులోనూ పెద్ద దిక్కు లేకపోయె బిడ్డలన్నతర్వాత వాళ్ళ కేదో ఒకటి వస్తుంది. వస్తే ఏం చేస్తుంది? దానంతటదే పోతుంది" కాసేపాగి "కొత్త చోట కాపురమనుకుంటాను. అన్ని సౌకర్యాలూ కుదిరాయా అమ్మాయ్."" అన్నాను.

బిడ్డను తొట్లో వేసి ఊపుతూ చెప్పుక పోతోంది మాలతి బావిలో నీళ్లు చేంత్రాటి కందడంలేదనీ, పనిమనిషిని నమ్మడానికి వీల్లేదనీ, దొరుకుతున్న పాలలో నీటిపాలే ఎక్కువనీ .... యిలా సాగిపోతోంది ప్రసంగం.

పదినిమిషాలు అలా కొనసాగిన తర్వాత ప్రసంగం ఆమె పుట్టింటివైపు మళ్ళింది. అక్కడినుంచీ మరెక్కడికి విస్తరిస్తుందో తెలియడంలేదు. "ఓహో, ఔనౌను, అలాగా" అన్న పొడిమాటలతో నేను అక్కడక్కడా అడ్డు తగలకుండా వున్నట్టయితే ఆమె వాక్ప్రవాహం పేరా గ్రాఫులు లేని రచనలా ఏకంగా ప్రాకి పోయి వుండేది.

చిత్రమేమిటంటే, యింతసేపు మాట్లా డింది గదా మాలతి, ఆమె మాటల్లో మచ్చుకొక్కసారైనా వీరభద్రాన్ని గురించిన ప్రసక్తి పొడసూపలేదు.

ఆఖరుకు నేనే అడిగాను—"అది కాదమ్మాయ్‌! వీరభద్రాన్ని గురించి ఒక మాటయినా చెప్పావు కావే 'మని!

తెచ్చిపెట్టుకున్న ఉత్సాహమేమో మరి, అది ఒక్కపెట్టున చల్లారిపోయింది. గల గలా ముడుచుకున్న పద్మంలా ఆమె ముఖం కాసంతైపోయింది.

ఇక్కడేదో దురూహ్యమైన రహస్య ముందిరా బాబో అనుకున్నాను.

అనుకోడంతో ఏమయింది? అంతు కనుక్కోవాలి గదా! మళ్లీ అడిగాను. ఎక్కడికి వెళ్ళాడమ్మా అని.

"ఎక్కడికి వెళ్లారో మరి. కోటయ్యను అడిగి చూడాలి.... '

కాసేపు వేచి చూచాను. అడిగి చూడా లంటుందే గానీ అడగదే మాలతి!

"ఐతే బయటికి వెళ్తున్నప్పుడు ఎక్కడికి వెళ్తున్నాడో, ఎప్పుడు తిరిగి రాగలడో నీతో చెప్పివెళ్ళే అలవాటు లేదన్నమాట!"

"మగవాళ్ళన్నతర్వాత వెయ్యి పను లుంటాయన్నయ్యా! ఎక్కడికైనా వెళ్ళ




గలరు. ఎప్పుడైనా రాగలరు. ఆదివారం గదా. ఈరోజు ఎక్కడికీ వెళ్ళరేమో ననుకున్నాను. ఉదయం ఎనిమిదిగంట లప్పుడుగూడా ఆఫీసురూంలో ఎవరితోనో మాట్లాడుతుండగా విన్నాను. ఎనిమిది న్నరకు కాఫీ తీసుకెళ్ళేసరికి అక్కడ లేరు...." అప్పటికిగానీ కాఫీతో నాకూ కాస్త అవసరముంటుందని తోచిందికాదు మాలతికి! "ఉండండన్నయ్యా! ఇప్పుడే వస్తాను" అంటూ వంటగదిలోకి పరుగు తీసింది.

మాలతి తీసుకొచ్చిన కాఫీలో తీపి తక్కువ. గృహవాతావరణంలో అంత ర్లీనమైవున్న వికారం కాఫీపైనగూడా పనిచేసి, ఆ పానీయాన్ని మరీ చేదుగా మార్చివేసినట్టుంది. ఆ వికారాన్ని ఏమను కోవాలి? విరసమా? వైమనస్యమా? ఏ దైనా. కాకపోయినా ఒకరిపట్ల ఒకరిలో వైముఖ్యం ప్రేళ్ళు పాతుకపోగా ఆ భార్యాభర్తలు ఎడముఖం, పెడముఖంగా ప్రవర్తిస్తున్న సూచనలు కానవస్తు న్నాయి....ఇలా ఆలోచిస్తూ ఆ వైశాఖ మాసపు మధ్యాహ్న సమయాన పేవ్ మెంటుపైన నడిచిపోతున్నాను. అప్పుడే మార్నింగ్ షో వదిలిపెట్టున్నారు. గుంపులు గుంపులుగా కదిలిపోతున్న ప్రేక్షకుల్లో నుంచి గొంతెత్తి పిలిచాడు వీరభద్రం!

అదేవేషం. అదేహాసం! నిండుగా వికసించిన బంతిపువ్వులా వున్నాడు. సామాన్య మానవుల్ని చుట్టుముట్టే కష్ట నష్టాలూ, చీకుచింతలూ వీడిని స్పృశిం చనే స్పృశించవా, లేక స్పృశించినా వీడువాటి కతీతుడా! ఏమిటో మరి! ఈ నిశ్చింత, ఈ నిత్యసంతోషం అందరికీ

అబ్బుం గాపు.

వీరభద్రం నన్ను వెంటబెట్టుకుని ఓ పెద్ద హోటల్లోకి దారితీశాడు. వెళ్ళి కూర్చున్న కొద్ది సేపటికల్లా కూల్ డ్రింక్సు టేబిలు పైకి వచ్చేశాయి.

''నీ కోసం యింటికి వెళ్ళొస్తున్నాను'' అని చెప్పడానికి రెండు మూడు సార్లు ప్రయత్నించి చూశాను. కానీ పెదవి కదపడానికి అవకాశమేదీ? బ్లూ మౌంటన్ ఎక్స్‌ప్రెస్‌లా సాగిపోతున్నాడు వీరభద్రం!

ఇటీవల అందుకని మదరాసుకు వెళ్ళి తాను చూసి వచ్చిన సినిమాల్లోని విశేషాలు, ఉత్తరదేశ యాత్రలో తాను చూసిన క్షేత్రాలు, గార్డ్నర్ నవలలో పెర్రీమాసన్ సాహసాలు, ధారావాహివిగా చెప్పుక పోతున్నాడు వీరభద్రం.

వాడు చెబుతున్న ప్రతి విషయమూ నా కందుబాటులో లేవి దే! ప్రతిమలా వింటూ కూచున్నాను.

గోడ గడియారంలో ఒంటిగంట కావస్తోంది.

వీరభద్రం సర్వరును పిలిచి ఆకులు వేసేయమన్నాడు.

''ఇదేం కర్మరా వీరభద్రం! లక్షణంగా యిల్లుండగా హోటల్లోనా భోజనం?'' అంటూ తెల్లబోయాను.

''నీకు తెలియదులేరా బాబూ. మా ఆవిడ పని ఆ కుక్కరకుంకలతో వేగడంతోనే సరిపోతుంది. ఇంక మనల్ని చూడగానె వంట ప్రారంభిస్తుందనుకో. ఆ వంట మూడు గంటలకుగాని తెమలదు. ఎందుకొచ్చిన గొడవ చెప్పు! ఒకరికి దనంగా శ్రమ కలిగించడం భావ్యమా! భార్య అన్న వ్యక్తి గూడా అందరిలాంటి మనిషేనన్న విశాలభావంతో చెబుతున్నాను' అదిలో మెల్లగా నవ్వసాగిన వీరభద్రం తన సంజాయిషీ పూర్తయ్యేసరికి బకెట్లో గిన్నెలు కడుగుతున్నట్టు ఉద్ధృతంగా నవ్వసాగాడు.

''ఐతే నువ్వు మీ ఆవిడమీద ఈగను గూడా వ్రాలనీయడం లేదన్నమాట!'' ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

వీరభద్రం నా ముఖంలోకి పరిశీలనగా చూస్తూ ''నువ్వు యింటికెళ్ళొస్తున్నావా ఏమిటి?' అన్నాడు.

అవునన్నాను.

''నిజం చెబుతున్నానురా రామం! నా మూలంగా ఆవిడకు ఆవగింజంత కష్టమైనా కలగడం లేదు. నేనొకరోజు యింట్లో భోజనంచేస్తే అయిదు రోజులు బయటుండిపోతాను ఇక కలుగుతున్న చింతలూ, వంతలూ తనకు తనమూలంగానే కలుగుతున్నాయంటే అందుకు వాది జవాబ్దారి గాదు!'

''ఎడ్చావులేరా వీరభద్రం! నీ వాలకం చూడగానే తెలిసిపోతోంది. ఊళ్ళో యిల్లుండగా నువ్వు హోటల్లో భోజనానికి సిద్ధమయ్యావు. బిడ్డకు ఒంట్లో బాగుండక పోయినా, అవేం పట్టనట్టు సినిమాకు




చెక్కేశావు! ఎవరిదగ్గర నీ బుకాయింపులు!'' అన్నాను

వీరభద్రం నా అవివేకానికి జాలి పడుతున్న వాడిలా నా వైపు విచిత్రంగా చూచాడు.'' అదికాదురా బాబూ! హోటల్లో భోజనం చేయడానికి కారణమేమిటో చెప్పనే చెప్పాను. ఇక సినిమాకు వెళ్ళడమంటావా, ఏదో మనబోటి వాళ్ళం వెళ్తున్నాము గనుకనే సినిమాలు జరుగుతున్నాయి. బిడ్డకు కాస్తా నలతగా వున్న మాట నిజమేననుకో! గానీ అందుకు నేను చేయగలిగిందేముంది చెప్పు! మేమున్న వీధిలోనే యిద్దరు డాక్టర్లున్నారు. కోటయ్యతో ఒక మాట చెబితే వాడే తీసుకొస్తాడు....''

''దొరికినా సరైన కోటయ్యే దొరికాడు నీకు! తన్ని తగలేస్తాడేమో నన్నంతగా భయపడి పోయాను'' అంటూ భోజనానికి ఉపక్రమించాను.

''వాడంతే, వాడంతే!'' విరగబడి నవ్వేశాడు వీరభద్రం. ''వాడు మహా మహావాళ్ళనే ఖాతరు చెయ్యడు. కానీ మనమంటే మాత్రం సింహ స్వప్నం. ఐతే నువ్వు వాడితోనూ బేటీ అయ్యావన్న మాట! మోతాదు మించి మాట్లాడ లేదు గదా! వాడు వట్టి అబద్ధాలకోరు!''

కానీ నేను వీరభద్రం స్టేటుమెంటు ప్రకారం కోటయ్యను అబద్ధాలకోరుగా నమ్మే స్థితిలో లేను ఎందుకంటే వీరభద్రం సత్యసంధత పట్లగూడా నాకు అనుమానాలున్నాయి.

భోజనమైన తర్వాత బజార్లో కొన్ని

తొందరపడుతుండడంవల్ల వీరభద్రందగ్గర సెలవు తీసుకుని హోటల్లోనుంచి బయట పడ్డాను. రేడియోలో ఏవో మంచి రికార్డులు రాబోతున్నాయనీ, అవి పూర్తికాగానే వేరుగా యింటికే వెళ్తాననీ చెప్పాడు వీరభద్రం।

* *

వీరభద్రాన్ని ఆనాడు హోటల్లో చూడడమే చూడడం. ఆ తరువాత రెండేళ్ళు గడిచిపోయాయి.

ఈ మధ్య కోటయ్య ఒకసారి తాలూకాఫీసు ప్రాంగణంలో కనిపించాడు. కనిపించడంలో అబ్బురమేమీ లేదుగానీ, అతడు పసపిట్టలా వాగేశాడు.

"ఇప్పుడు నేను వీరభద్రందగ్గర లేనండీ" అన్నాడు కోటయ్య.

"అవ్వే. వాడిదగ్గర పనిచేయడం కంటే, హాయిగా ఉద్యోగం మానేయడమే మేలు। వాడి సంగతి నాకు బాగా తెలుసు" అన్నాను.


అంతటితో పుంజుకున్నాడు కోటయ్య. సంసారం వీరభద్రానిదైనా దాన్ని నిర్వహించే భారం కోటయ్యదేనట। ముందూ వెనకా చూడకుండా బజారులో అప్పులు పెరిగిపోతూ వుండవలసిందే। నెల పుట్టగానే అప్పులిచ్చినవాళ్ళు మేలుకుంటారు. కోటయ్య ముఖం కనిపించగానే ఖాతాపుస్తకాలు పైకితీస్తారు. చేతులు నలుముకుంటూ కోటయ్య వీరభద్రం ఎదుట నిలబడి కొద్దో, గొప్పో ముట్టజెప్పుకోకపోతే ఎలాగండీ అంటూ ప్రాధేయపడతాడు. వీరభద్రం బదులు చెప్పడు।

"ఇదిగో కోటయ్యా। సిగరెట్లు తెచ్చి పెట్టు" అంటాడట వీరభద్రం. కానీ డబ్బు మాత్రం యివ్వడు. అవతల బంకులో, చిల్లరంగడిలో, బట్టలకొట్టులో, ఫ్యాన్సీషాపులో ఇందుగలడందు లేడన్న సందేహానికి చోటులేకుండా యెక్కడా బాకీలే। ఏం చేయగలడు కోటయ్య। అప్పులవాళ్ళు నిలవేసి అడిగారు. "బాబ్బాబూ। నేనే పాపమూ ఎరుగను. వెళ్ళి ఆయన్నే పలకరించండి" అన్నాడు కోటయ్య. వాళ్ళంతపనీ చేశారు కానీ ఆగ్రహోదగ్రుడై పోయాడట వీరభద్రం। నేనెవరిని, మీరెవరు? మీ ముఖం ఎవరు చూచారు? పో పొమ్మనేశాడట।

ఆఖరుకు వాళ్ళందరూ తమకు కలిగిన నష్టానికి పరిహారంగా కోటయ్యను సున్నంలోకి ఎముక లేకుండా చిత్తుచిత్తుగా బాదేయాలన్న నిర్ణయానికి వచ్చేశారట।

"మీ వీరభద్రానికి పదివేల నమస్కారాలు. నిభాయించుకోలేక పారిపోయి వచ్చేశాను బాబూ। నేను లీవు పెట్టేశానా, ఆ ఖాళీలో మరొకణ్ణి వేశారు. వాడూ పది రోజుల్లో పరారై పోయాడు...." అంటూ ముగించాడు కోటయ్య.

ప్రతి జవానూ యిలాగే అయితే వీరభద్రం గతి ఏం కావాలన్న ఆలోచనలో పడ్డాను. వీరభద్రం తనంతట తానుగా




వెళ్ళి అప్పులకోసం ప్రతిమాలుకోలేడు. ఒకవేళ అలా ప్రతిమాలుకోవడం మూలంగా అప్పులు పుట్టినా, తప్పనిసరిగా వాటిని చెల్లించుకోవలసి వుంటుంది. కానీ అలా అప్పులు తీర్చడం వాడి ఆరోగ్యానికి బొత్తిగా సరిపడని విషయం గనా! అయ్యో పాపం! ...నాకు వీరభద్రంపైన కాస్త జాలిగూడా కలిగింది.

కోటయ్యద్వారా ఈ వర్తమానం తెలిసిన తర్వాత ఒకసారి వీరభద్రాన్ని కలుసుకుని ఘాటుగా మందలించాలన్న ఉద్దేశం కలిగింది. ఆ ఉద్దేశం ఉద్దేశంగా వుండగానే ఓరోజు సాయంకాలం తిరుపతి బస్‌స్టాండులో చలమయ్యగారు కనిపించారు.

చలమయ్యగారంటే వీరభద్రానికి పిల్లనిచ్చిన మామగారు.

నన్ను చూడగానే ఆయనకు ప్రాణం లేచివచ్చినట్టయింది. "జాబు గూడా వ్రాయాలనుకున్నాను. కానీ నీ చిరునామా సరిగ్గా తెలిపింది గాదు. రావయ్యా బాబూ! నీతో చాలా విషయాలు మాట్లాడాలి" అంటూ నన్నాయన దూరంగా తీసుకెళ్లారు.

ఆయన మాట్లాడబోతున్న విషయాలేవో నాకు చూచాయగా తెలుసు. అనుకున్నట్టుగానే పెద్ద ఉపోద్ఘాతమేమీ లేకుండా ఆయన అసలు విషయంలోకి వచ్చేశారు.

ముఖ్యమైన విషయమేమిటంటే గవర్నమెంటువారు నియమించిన ఉద్యోగి కోటయ్యకుమల్లే, కట్టుకున్న భార్య మాలతి గూడా ఆ కాపురం చేయలేక పెట్టె, బేడా సర్దుకుని పుట్టింటికి వచ్చి చేరిపోయిందట!

"రాకేం చేస్తుంది నాయనా, ఆడబిడ్డకు

అలనా, పాలనా లేకపోయిన తర్వాత!" నావైపు దీనంగా చూచారు చలమయ్యగారు, "అతగాడికి పెళ్ళామంటూ ఒక మనిషి యింట్లోవుందన్న ధ్యాసే లేదు. అతడికోసం ఏ పూట భోజనం చేయాలో, ఏ పూట చేయవలసిన అవసరం లేదో ఊహించడం సాధ్యం కాదు. అంత పంక్చువల్‌గా యింటికొస్తా డన్నమాట! తన సినిమాలు, తన హోటళ్ళు, తన ఉబుసుపోకలు యివే అతడి ప్రపంచమైతే ఇక అమ్మాయికక్కడ పనేముంది చెప్పు! వాడి ప్రాణానికి ఉసూరుమంటూ ఆమె బిడ్డలతోసహా వచ్చి మా పాల పడింది. కన్నబిడ్డ తల్లిదండ్రులకు భారం కాబోదు కదా!" కాసేపాగి పెదవి విరిచి తల ఊపుతూ అన్నారు చలమయ్యగారు. "నాకో విషయం బాగా అవగతమై పోయింది బాబూ! వాడు బాగుపడడం కలలోని మాట! ఏనాటికైనా వాడు మట్టి గుర్రమే! అందుకనే నేను దూరదృష్టితో ఓ పని చేసేశాను ..."

"ఏం చేశారేమిటి!" కంగారుగా ప్రశ్నించాను

"నీ స్నేహితుడికేమీ ప్రమాదం తల పెట్టలేదు లేవయ్యా రామం. నేను తీసు కున్న జాగ్రత్త మా అమ్మాయిని గురించే! ఎందుకైనా మంచిదని ఓ కుట్టుమిషను కొనిపెట్టేశాను. కొంతకాలంపాటు పని లేస్తే, ఆ పనిలో చేయి తిరుగుతుంది. చేతిలో ఒక పని వున్నట్టయితే ఎవరికి వారు మరొకరిపైన ఆధారపడకుండా జీవితం గడుపుకోవచ్చు. అదీ నా ఆలో చన! నువ్వేమంటావో మరి!"

అనడానికేముంది! ఆయన చాలా మంచి పనే చేశారు. నేనేమైనా అనదలచు కున్నట్టయితే ఆ వీరభద్రాన్నే అనాలి.

"కాపురం యిలా వెలగబెట్టాడా, యిక ఆ ఉద్యోగం సంగతి సరేసరి! ఆడివిలో ముళ్ళపొదల్లా ఫైళ్లు పెరిగి పోతూ వుండవలసిందే! పై అధికారుల దగ్గరినుంచి ఎక్స్‌ప్లనేషన్లకోసం తాఖీదులు వస్తూ వుండవలసిందే! వీడి స్వైర విహారాలు మాత్రం యథాప్రకారంగా సాగుతూ వుండవలసిందే! ఇందుకు గాక పోతే నెలకో ఊరికి ట్రాన్సఫరెందు కొస్తుందో చెప్పు...."

నోట మాటరాక నేను దిగాలుపడి విల్చుండిపోయాను. నన్నా అవస్థలోనే దిగవిడిచి బస్సుకు వేళ మీరిపోతోందని చలమయ్యగారు గబగబా వెళ్లిపోయారు.

వీరభద్రంపట్ల నా కాదినుంచీ కొన్ని అనుమానాలు కద్దు. క్రమబద్ధంగా ఓ కార్యాన్ని నిర్వహించడ మనేది వాడి తత్వానికి సరిపడని సంగతి. ఇలాంటి వాడు యిటు సంసార సాగరాన్ని యీదడం లోనూ, అటు ఉద్యోగ బాధ్య తల్ని నిర్వర్తించడంలోనూ ఎంతవరకు కృత కృత్యుడు కాగలడన్నది సందేహా స్పదమైన విషయమే! కానీ ఈ అను మానానికి వెనుక నాకో ఆశగూా

వుండేది. చెరకు వంకరను గానుగ చక్కబరిచినట్టుగా వీరభద్రంలోని వక్ర స్వభావం కాలక్రమాన చక్కబడ వచ్చునని నేను భావించాను కానీ నాకు చలమయ్య గారు కనిపించిన తర్వాత ఆ ఆశ గూడా పటాపంచలై పోయింది.

ఇంక నాకు మిగిలివున్న కోరిక ఒక్కటే: వీరభద్రాన్ని కలుసుకోవాలి వాడి మూర్ఖత్వాన్నీ తెంపరి తనాన్నీ వాడికే వివరించి సమాజంలో బ్రతకడానికే వాడనర్హుడన్న యదార్థాన్ని కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పేయాలి. అప్పటికి నేను నా కర్తవ్యాన్ని నిర్వహించిన వాడి నౌతాను, ఆ తరువాత వాడేమైనా నాకు చింత లేదు.

సరిగ్గా ఈ ఘట్టంలోనే నేను వీరభద్రం కోసం పనిగట్టుకుని అన్వేషణ కొనసాగించాను అలా అన్వేషణ సాగించినప్పుడే వీరభద్రం మాయలేడిలా మారి నన్ను పూళ్ళు త్రిప్పించాడు. ఆఖరుకు ఓ రోజు రాత్రి ఏడుగంటలప్పుడు నా చేతికి దొరికింది థియేటరులోపల! చేయి చేసుకోడానికి కాదు సరిగదా, దుయ్యబట్టడానికి గూడా వీల్లేని పరిస్థితి.

చేసేదిలేక వాడిపైన నా ఆరోపణలను మాత్రం మోపి, వాటికి బదులు చెప్పవలసిన అవసరం లేదనీ, చెప్పినా నేను వినిపించుకో దలచడం లేదనీ కచ్చితంగా చెప్పేశాను.

నా ఆరోపణలు మూడు.

ఒకటి: వీరభద్రం తన తాహతుకు మించిన అప్పులు చేస్తున్నాడు. వాటిని తీర్చేప్రసక్తి కలలోనైనా తలపెట్టడం లేదు. కోటయ్య చెప్పకుండా పారిపోవడమే అందుకు తార్కాణం.

రెండు: వాడు భార్య పట్ల కనబరుస్తున్న అనాదరణ అవధుల్లేనిది. ఎంతగా మనసు చెదిరిపోకపోతే ఆమె తన జీవనానికి దర్జీ వృత్తిని ఆలంబనంగా స్వీకరిస్తుంది?

మూడు: ఉద్యోగిగా గూడా వీడు తన అప్రయోజకత్వాన్ని నిరూపించుకున్నాడు. మాటి మాటికీ వచ్చి పడుతున్న ట్రాన్స్‌ఫరు ఆర్డర్లు అందుకు తిరుగులేని నిదర్శనాలు.

నా మాటల్ని వింటూ వీరభద్రం ఆశ్చర్యంతో నోరు తెరిచేశాడు—

"ఒరేయ్, ఒరేయ్! ఇదేమిట్రా రామం! ఉన్నట్టుండి నీకుగానీ పిచ్చిబట్టి పోలేదు గదా!" అన్నాడు.

తెల్లబోయి అయోమయంగా వాడివైపు చూచాను.

"కాకపోతే నువ్విలా మాట్లాడే వాడివే కావు. నేను మితిమీరిన అప్పులు చేశాను. వాటిని తీర్చలేక పోయాను. అందుచేత కోటయ్య పారిపోయాడనుకుంటున్నావు! ఇంతకంటే శుద్ధ అబద్ధం మరొకటి ప్రపంచంలో వుండబోదు. వాడు, ఆ పుంజాకోరు అయిన బీడీలన్నీ కాల్చి, అయిన టిఫిన్లన్నీ తిని ఓపినన్ని అప్పులు

చేసి పెడితే వాటిని నేను చెల్లించాలనా నీ వుద్దేశం! బాగుందిరా బాబూ బాగుంది. పోతే భార్యను నిరాదరణ చేశానంటున్నావు. నువ్వు నా బాల్య మిత్రుడివి! నువ్వు అనావచ్చు నేను వినావచ్చు! కానీ నువ్విలాంటి తెలివి తక్కువ ఆరోపణ చేయగలనని నేనేనాడూ అనుకోలేదు. ఏం నిరాదరణ చేశాను నేను! కొట్టానా, తిట్టానా? చీదరించుకున్నానా? లేదే! గిరి గీసి దీన్ని దాటగూడదని కట్టుబాటులో వుంచానా? లేదే! ఆవిడను గూడా సాటి మనిషిగా ట్రీట్ చేశాను. పని మనిషిగా భావించలేకపోయాను. ఇది నా తప్పయితే కావచ్చు. తన అభిరుచులు తనవి. నా అభిరుచులు నావి. వాటికి పొత్తు కుదిరే మాట కల్ల! కానీ వీలైనంతలో సహజీవనం జరుపక పోదామన్నాను. ఊఁహూ, అలా వీల్లేదంటే నేను చేయగలిగిందేముంది? సరే, పుట్టింటికి వెళ్ళింది. వెళ్తేవెళ్తుంది. మళ్ళీ రాగూడదన్న షరతులేదు గదా! రాలేదు. అక్కడ కుట్టుపని నేర్చుకుంటోందని యిటీవలే తెలిసింది. నేను నిజంగా ఆశ్చర్యంతో బిర్రబిగుసుక పోయాను. ఆనందంతో మైమరచి పోయాననుకో! స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యంతోపాటు ఆత్మ గౌరవం సిద్ధిస్తుందని నా నమ్మకం మా ఆవిడ ఆదర్శమహిళగా రూపొందడానికి పరోక్షంగానైనా కారణభూతుణ్ణి కాగలిగినందుకు నే నెంతో గర్విస్తున్నాను! ఇక మూడోది. నా ఉద్యోగ విషయం. నాకు తరచుగా బదిలీలెందుకు వస్తున్నాయో నువ్వు అడిగి తెలుసుకోవలసింది! అలా అడక్కుండా గొప్ప తెలివిమంతుడిలా ఊహాగానాలు చేయబోయావు. అసలు కథ వేరు! ఒక్కొక్కచోట పైవారు పట్టించుకోక పోవడంవల్లనైతేనేమి, గ్రామోద్యోగులు కాళ్ళు బారజాపుకుని కూచోవడంవల్లనైతేనేమి పనులు పేరుక పోతాయి. శిస్తులు బకాయి పడిపోతాయి. అప్పుడా పేరుకపోయిన వ్యవహారాన్నంతా ఒకకొలిక్కి తీసుకరావడానికి నిప్పులాంటి ఉద్యోగి ఒకడు కావలసి వస్తాడు. ఎక్కడెక్కడైతే అలాంటివాడు అవసరమో, అక్కడికల్లా నేను రవాణా చేయబడుతున్నాను. ఇదిగూడా నా తప్పేనంటావా."

చుట్టు ప్రక్కల వాళ్ళు ఏమనుకుంటారో నన్న స్పృహకూడా లేకుండా వీరభద్రం ఉపన్యసించుక పోతున్నాడు. వాడి తర్క కౌశల్యం ఎదుట సమ్మోహితమై, స్తబ్ధమైపోయిన నా బుద్ధి ఆ ఉపన్యాసంపైన లగ్నం కావడం లేదు. వీరభద్రం కాపురం చేయలేక పోవచ్చు, ఉద్యోగమూ చేయలేక పోవచ్చు కానీ బ్రతక లేకపోడు! వీరభద్రాన్ని గురించి నేనీమాట మాత్రం ఢంకా బజాయించి చెప్పగలను!